బిచ్చగాళ్ల జెండా

శ్రీ మునిపల్లెరాజు

నేను రెండవప్రపంచ సంగ్రామంలో వైమానికోద్యోగిగా, చావు బదుకుల మధ్య ఆకాశంలో జరిగిన ఒక విమానపోరాటంలో గాయపడ్డాను. నా గాయాలు ఏమంత ప్రాణప్రమాదకరమైనవి గాకపోయినా, నా విమానపు పెట్రోలుటాంకుకు, శత్రువుల మరతుపాకి గుళ్ళతో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు, నాకు తగిలిన "షాకు"తో చాలా నెలల పాటు నేను మంచంలోనే వుండిపోవలసివచ్చింది. అప్పట్లో ఆరోగ్యానికని, పూనాలో ఒక బంగాళా అద్దెకు తీసుకొని వుండేవాణ్ణి. ఎందువల్లంటే నన్ను రక్షించిన డాక్టరు మిత్రుడు అక్కడివాడే గనక.

నా బంగళా శివాజీనగర్ తోటలమధ్య రైల్వే గిడ్డంగుల చూపుమేరలో, ఎండిపోయిన మూలానది ఎడమతీరాన వుండేది; మా బంగళా ముందున్న శిథిలమైన తోటలోనే నాకు ఎక్కువ కాలక్షేపం అయిపోతుండేది. ఈ శిథిలవనం పక్కనే చాలా పెద్ద ఖాళీస్థలం, ఆ స్థలానికి చివరలో మరొక పాత మేడ వున్నాయ్. ఈ ఖాళీస్థలంచుట్టూ, దాని యజమానులు ఒక దశాబ్దం క్రిందనో, ఏమో వేయించిన ముళ్లతీగ కంచె గూడా పేరుకుమాత్రమే మిగిలివుంది. చాలా రోజులు పాడుబడి జీర్ణావస్థలోవున్న యీ పాత మేడను బొంబాయి సేఠ్ ఒకాయన కొని కొన్ని రిపేర్లు చేయించి కొద్దికాలంలోనే అందులోకి వచ్చాడు. మా తోటమాలివల్ల, యీ సేఠుగారి వ్యాపారం యుద్ధం తర్వాత బొంబాయిలో కడబట్టగా యిక్కడకు చేరినట్లు తెలిసింది. ఈ షావుకారి పేరు—శంకర్ లాల్ భోగాలాల్.

శంకర్ లాల్ భోగాలాల్ ముఖం చూడగానే నాలో కొన్ని వింతవుద్దేశ్యాలు వుద్భవించిన మాట సత్యం. మొదటిది—అసహ్యభావం. ఆ ముఖంలో కళాకాంతీ లేదు. సేఠు రోల్డుగోల్డు కళ్లజోడు వెనుకనున్న క్రూరత్వం ఏదో నాకు అస్పష్టంగా అవుపించింది. లావుగా, పొడుగ్గా భోగాలాల్ వూగి నడవటం గూడా నాకు జుగుప్సగానే వుండేది. రెండో వింతభావం—యీ షావుకారు చాలా దురాశాపరుడని. మూడవ భావం నా జీవితంతోనే సంబంధించినది. నేను వైమానికోద్యోగిగా యుద్ధశాఖలో చేరకపూర్వం, బొంబాయిలో చిత్రాలకు సినేరియోలు, కథలూ వ్రాస్తూండేవాణ్ణి. నాకు సినేరిష్టుగా పేరు రాకముందు, నిరక్ష్యరాస్యులైన, ఏమాత్రం కళాదృష్టీ లేని ఫిలిం పెట్టుబడిదార్లు కల్పించిన అవమానాలూ, హింసలూ, మోసాలూ అన్నీ అనుభవించాను. మొదట్లో నా కథ నొకటి కొంటామని నమ్మించి తీసుకొని, ఒక వారంరోజులు తిప్పి చివరకు—"నీ కథ మాదగ్గర్లేదని" అబద్ధమాడి మోసంచేసి, చివరికి నా బుద్ధిబలంతోనే లక్షలార్జించిన గుజరాతీ సేఠ్ ముఖకళవళికలు—నాకీ భోగాలాల్ సన్నకళ్ళజోడు వెనుక దృగ్గోచరమైనాయి.

ఈ విషయం నిర్ధారణ చేసుకుందామని నాకు ఒక విధమైన వుద్వేగమే కాకుండా, గొప్ప వుత్సుకత గూడా జనించింది. వైమానికదళంనుండి విడుదల పొందగానే తిరిగి ఫిలిం కథలు, సినేరియోలు వ్రాయటమే వృత్తిగా నిర్ణయించుకొన్న నాకు, యీ పాతమోసగాడిచరిత్ర తెలిసికోనే కుతూహలం జనించటం మానవస్వభావ దౌర్బల్యమే కావచ్చు.

కాని యీ కౌతూహలం తీరకముందే ఒక భయంకర సంఘటన సంభవించి నా ప్రయత్నాలన్నింటినీ భగ్నం చేసింది. ఇది యిట్లా సంభవించింది.

* * * *

శంకర్ లాల్ భోగాలాల్ పాతమేడముందున్న ఖాళీస్థలంలో ఒక రోజున హఠాత్తుగా కొన్ని చిన్న గుడిశెలు వెలిశాయ్. ఇది పెద్ద విచిత్రమైన విషయం కాదు. ఆ ఖాళీస్థలం—బిచ్చగాళ్ళకు, నగరంలో హోటళ్లకు నోచుకోనని పల్లెటూరి ప్రయా

టీకులకూ, చాకులూ కత్తులూ అమ్మ జూపి యింకా దోపిడీలు, దొంగతనాలూ కావించే రోహిల్ ఖండ్ దండునకూ—ఒక విధంగా అది బహిరంగ సత్రం. నేను చాలాసార్లు రైళ్ళనుండి దింపివేయబడిన గోసాయీలను గూడా చూశాను. కాని ఎప్పుడూ యిట్లా ఆంధ్రదేశంలోని మెట్టజిల్లాలను స్మృతికి తెచ్చే ప్రకృతి కట్టడాలను చూడలేదు.

నిజానికవి నైజాంప్రాంతంనుండి పనులకోసం వలసవచ్చిన వడ్డె వుప్పరులవి. నల్లగా, మట్టిబొమ్మల్లాగా, ఎండలో నిగనిగలాడే కండలతో, బలిష్టమైన శరీరాలతో—బొంబాయి, పూనా నగరాల్లో ఎన్నో రోడ్లు, కట్టడాలు నిర్మించిన తెలుగునాటి వడ్డెవుప్పరులమీద జాలితో భోగాలాల్ వాళ్ళకీ నివేశనస్థలం యివ్వలేదని మా తోటమాలి కబురు తెచ్చాడు.

“మరెందు కిచ్చాడు?” అని అడిగాను నేను.

“మీకు తెలీదు బాబూ! వాళ్ళందరివద్దా గుడిశెకు అయిదు రూపాయలు కాజేశాడు. అంతేకాదు. యీపైన నెలకు రెండు రూపాయల బాడిగ కూడా గుడిశెకు ఒక్కంటికి యిచ్చుకోవాలి. వీటన్నింటినీ మించిన యింకో రహస్యంవుంది బాబూ! ఈ వుప్పర్లు బియ్యం తినరు. వాళ్ళపేరన చాలా దొంగ రేషనుకార్డులు సృష్టించి, ఆ బియ్యాన్ని తనే నల్లబజారులో అమ్ముకుంటాడు. అవును బాబూ, మరి బొంబాయిలో వచ్చిన నష్టాల్ని, యీ సేకలు యితర ప్రదేశాల్లోనే గదా పూడ్చుకోనేది?’

తోటమాలి గణేష్‌మారుతి సేఠ్‌లంటే ద్వేషంగా, వుద్రేకంతో ఒక్కొక్కసారి చాలా నిరసన హాస్యంతో మాట్లాడేవాడు.

“బ్లాక్ మార్కెటంటే నేను సహించను. చూడు. పోలీసు సూపరింటెండుకు వ్రాస్తాను” అన్నాను నేను.

గణేష్‌మారుతి కనుబొమ లెగరవేసి “మీకు పుణ్యం వుంటుంది” అన్నాడు.

* * * *

తటమాలి జోస్యం నిజమే అయింది—ఆనెల తిరక్కముందే. భోగాలాల్ రేషన్‌షాపుకు లైసెన్సు సంపాదించి అక్కడ విచ్చలవిడిగా వడ్డెర్లను దోచివేస్తున్నాడని నేను సులభంగానే గ్రహించగలిగాను.

* * * *

నేను సైనికాధికారిని కావటంతో నా ఒక్క చీటీనీ పోలీసులు అలక్ష్యం చెయ్యలేకపోయారు.

ఒక వుదయం ఒక పోలీసుదళం, రేషనింగు యిన్స్పెక్టర్లూ కలిసి భోగాలాల్ ఆవరణను చుట్టేసి అన్నీ తనిఖీచేసి వెళ్ళిపోయారు; కాని నాకు సూపరింటెండెంటు తెలియజేసిందేమంటే—భోగాలాల్ మీద కేసు పెట్టేందుకు తగిన ఆధారాలేవీ కనిపించలేదనీ, కాని తనుగూడా నల్లబజారు జరుగుతున్నదనే నమ్ముతున్నానని యింకా విచారణలు జరిగించి తీరుతానని.

ఏది ఏమయినప్పటికీ, మరో రొణ్ణాళ్ళల్లో వడ్డెవుప్పర్లు అక్కడనుంచి మకాం ఎత్తివేశారు.

* * * *

మళ్ళీ కొన్నాళ్ళు—వీదల డాక్ బంగ్లాలోకి వచ్చిన కొత్త పాంథులెవర్నీ నేను చూడలేదు.

ఇంతలోనే వేసంగి వచ్చింది. దానితోపాటు దక్షిణాదిలో కరువు వార్తలూ వచ్చిసాయ్. చూస్తూండగానే తమిళదేశపు బిచ్చగాళ్లు పూనా కంటోన్మెంటులోని పాశ్చాత్య నాగరీకుల హోటళ్లముందు డజన్లకు డజన్లు నిలబడి సాయంత్రాల్లో హోటళ్ళల్లో మూగే భాగ్యవంతుల నందరినీ చుట్టముట్టేస్తున్నారు.

ఈ బిచ్చగాళ్ళలో స్త్రీలు, పురుషులూ బాలురూ వున్నారు; సంఖ్యలో తమిళ బిచ్చగాళ్ళే ఎక్కువైనా రాయలసీమనుంచీ (ముఖ్యంగా బొంబాయికివచ్చే రైలుమార్గంలో వున్న నగరాలనుండి) హైదరాబాదు ప్రాంతాలనుంచీ వచ్చిన, ఏదో ఒక కమ్మని యాసతో తెలుగుమాట్లాడే ఆంధ్ర బిచ్చగాళ్లుగూడా వున్నారు వీళ్ళలో.

వీళ్ళందరికీ “రాష్ట్ర భాష” దక్షిణాదిలో మాట్లాడే బజారు వురుదూ.

ఈ దీనవదనాలు కొన్ని మాయింటి ముందున్న బహిరంగమఠంలో మకాం వేశారు.

పూనాలో అసంఖ్యాకమైన సంఘాలూ, సంస్థలూ, క్లబ్బులూ వున్నాయిగాని—చాలావరకు

అవి సమాజ సంస్కరణలతోనూ, స్త్రీల సమస్యల తోనూ సంబంధించినవి. కాని వీటిలో బిచ్చగాళ్ల వుపయోగార్థమై ఒక్కటీ లేకపోవటంలో వింత ఏమున్నది? అభాగ్య జీవితానికి—తరగని పాతరఅయిన మన దేశంలో ఏ ఒక్క సంస్థ యిందరు బిచ్చగాళ్లను పోషించ గలుగుతుంది?

మొదట్లో భోగాలాల్, అతడి వుత్తరాది బంట్రోతు గులాబ్ సింగూ బిచ్చగాళ్ళను అక్కడ నుండి తరిమివేశారు; కాని గణేష్‌మారుతి—మిలిటరీ ఆఫీసరు బంగ్లా తోటమాలి హోదాతో కొందరు నిర్భాగ్యులికి మాకంచపక్కనే ఆదరణ కలగజేశాడు. మళ్లీ మూకలు మూకలుగా—రేపటి దినమంటే లేని బిచ్చగాళ్లు, ఆ ఖాళీస్థలంనిండా మూగారు. ఈసారి భోగాలాల్ లాఠీవాళ్ళమీద తిప్పలేదు.

కొత్తల్లో, పగటి భిక్షాటనలను ముగించుకొని రాత్రిళ్ళు యీ బహిరంగ మఠంలో చేరిన "దేవుడి బిడ్డల" పాటలతో నాకు రాత్రి పన్నెండు గంటల దాకా కాలక్షేపం జరుగుతుండేది. కరువునూ, ఆకలినీ స్వదేశంలోనే వదిలి వచ్చేసినట్లుగా—ఆ జానపద గేయాలు. మళ్ళీ పొద్దున్నే పూలమళ్ళకు నీరు పోస్తూ ఆ ట్యూనులన్నీ తిరిగివల్లె వీసే ముసలిగణేష్‌మారుతి వణికే గొంతుతో నాకు మెళకువ వచ్చేది. మరు నిమిషం నాదికాని యుద్ధరంగంలో గూడా నాకేవో ఆంధ్రదేశపు దృశ్యాలో, జీవన పద్ధతులో గోచరమై యింటిమీది దిగులును నాకిట్లాగే వృద్ధి చేస్తుండేవి.

* * * *

నేను ఆఫీసర్ల క్లబ్బుకు వెళ్తూండగా, ఆ సాయంత్రం గణేష్‌మారుతి ఎదురొచ్చి "బాబూ, మళ్లీ సాగిస్తున్నాడు" అన్నాడు ముఖం చిట్లించి.

"ఎవరు ? ఏమిటి ?"

"సేర్ ! నల్లబజారు"

"నేను పోలీసులకు రిపోర్టు చెయ్యబోవటం లేదు" అన్నాను ఖచ్చితంగా.

మారుతి నావంక ఒకసారి నిరాశగా చూసి, తలమీది మురికిటోపీ సర్దుకుంటూ తన పని చూసుకో బోయాడు.

* * * *

వెలిసిపోయి, మురికిబారిన రంగు రంగుల పాత తుంపుల గుడ్డలతో మా యింటిముందు బిచ్చగాళ్ళ డేరాల శిబిరం వెలిసింది. వికలాంగులు, వృద్ధులు, రజాకార్ నరకాన్నుండి తప్పించుకువచ్చిన శరణార్థులు, క్షామపీడితులు యీ డేరా క్యాంపులోని పౌరులు. దక్షిణాది భాషలన్నీ, అన్ని బాధలనూ అన్ని ఆశలను అన్ని నిరాశలనూ భరించి

హాకల్ బెరీఫిన్

మార్క్ ట్వేన్ రచన

అనువాదం:

నండూరి రామమోహనరావు

వెల: రెండు రూపాయిలు

పోస్టు ఖర్చులు ప్రత్యేకము.

ఆంధ్రగ్రంథమాల, మద్రాసు.

నిశ్శబ్దత నిచ్చే కాల రాత్రుల్లో యీ నగరంలో, యీ తమస్సులో కలగా పులగంగా సజీవంగా వినబడుతుంటై; సృష్టీ, ప్రకృతీ, లోకమూ, మానవులూ తిరిగి ప్రాణంపొందే పునః కాంతుల్లోనే యీ అనాథనగరం నిర్జీవమైపోతుంది! ఈ దృశ్యాలకు నేను బాగా అలవడిపోయాను. యుద్ధంలో ప్రతిక్షణమూ, ప్రతి వస్తువులో, ప్రాణిలో, జీవిలో, ఆత్మలో మృత్యువూ, అపనమ్మకమూ దర్శించిన నాకు, యీ బిచ్చగాళ్ళ సన్నిధి ఏమని కష్టమనిపిస్తుంది?

కాని యీ నగరాధిపతి ఎవరు? తెలంగాణపు యాసతో రాత్రల్లా పదాలు పాడే ముసలి యల్లమందా? పెద్దగొంతుతో తమిళంలో తనకన్నా బలహీనుల్నీ, స్త్రీలను తిట్టే తెలివిగల బిచ్చగాడు మురుగేశనా? కాదు!

భోగాలాల్ నగరాధిపత్యం వహించిఎన్నాళ్లో అయింది. అదే గణేశ్ మారుతి నాకు చేసిన రొండవ కంప్లైంటు. బిచ్చగాళ్ళ దైన్యంనుండి, బిచ్చగాళ్ళ పాటలనుండి రూపాయలు సృష్టిస్తున్నాడు మాజీ స్టాక్ బ్రోకరూ, ఫిలిం నిర్మాతా, వడ్డీవ్యాపారీ, దివాలాకోరూ—భోగాలాల్.

బిచ్చగాళ్ళు అడుక్కువచ్చిన బియ్యమంతా తక్కువ ధరకు కొని, అందులో యింత తవుడూ యిన్ని రాళ్లూ, యింత మట్టీ కలిపి, మహారాష్ట్రపు ఎండు రొట్టెలు తినలేక చచ్చిపోతున్న మిలిటరీలో ఉద్యోగాలకని వచ్చిన దక్షిణాది బ్రాహ్మల కందరికీ మూడురెట్ల ధరల కమ్ముతూ, తన కులంవాళ్లలో తిరిగి గౌరవంపొందే అర్హతలనుసంపాదిస్తున్నాడు—శంకర్‌లాల్ భోగాలాల్.

ఎవరైనా, ఏరోజైనా తన బియ్యమో, గోధుమ పిండో యివ్వ నిరాకరించాడా, గులాబ్‌సింగ్ లాఠీదెబ్బలతో ఆ పట్టిన దయ్యం వదిలిపోతుండేది. లేదా భోగాలాల్ స్వయంగావచ్చి ఒక డేరాను కూలదోసి, ఆ బిచ్చగాణ్ణి అనాథనగరంనుండి వెళ్లగొడుతుండేవాడు. హైద్రాబాదు బిచ్చగాళ్లకు తమిళ బిచ్చగాళ్లు వత్తాసురాలేదు, తమిళ బిచ్చగాళ్లకు నైజాం బిచ్చగాళ్ల మద్దతూ లేదు. ఒకరోజున గులాబ్‌సింగ్ చేతుల్లో ప్రాణం విడువనున్న ఒక బిచ్చగాడి రక్షణకోసం, నేను, నాపాత రివాల్వరును భయానికి చూపించవలసి వచ్చింది.

కాని యీ స్వల్పవిషయాలేవీ అనాథ నగరాన్నంట లేదు. రాత్రిళ్లు జోరుగా పాటలు సాగుతూనే వున్నై. అప్పుడప్పుడు నందనార్ భజన కీర్తనలు. ఒకసారి నా ఆశ్చర్యానికి క్షేత్రయ్యపదం వినవచ్చింది.

* * * *

కొత్త బిచ్చగాళ్ల ప్రవాహం ఆగలేదు. ప్రతి దినమూ రైలుపెట్టెల్లో బల్లలకింద నక్కి-గూడ్సు బళ్ళల్లో గార్డుకు తెలీకుండా ప్రయాణంచేసీ దక్షిణాది కరువుదాసులు పూనా చేరుతునే వున్నారు. వీళ్ళకు తోడు మలబారునుండి గంజిలేక సైన్యంలో భర్తీ కావటానికి వచ్చి నిరాకరించబడ్డ ముసలీ ముతకా గూడా వున్నారు. నాలుగురోజుల పస్తుల్తో, ఎక్కడా కూలి దొరక్క, ఆత్మాభిమానం తనంతట తాను చావగానే వీళ్లందరూ కొత్త బిచ్చగాళ్ళై పూరి పొద్దెరగకుండా తిరుగుతున్నారు. ఈ మానవకోటి ఖాళీవున్న ప్రతి పేటలోనూ నిండిపోయింది. రోడ్లమీద, మరుగుదొడ్లలో, స్టేషనుముందు, దర్గాలమీద, స్మశానపు గేట్లముందు, శంకరలాల్ భోగాలాల్ తనదని చెప్పుకొంటూన్న ఖాళీస్థలంలో—ఒక టేమిటి?—అనంతమైన పూనాలోని అనారోగ్యకర ప్రదేశాలన్నింటిల్లో నిండి పోయింది. మా నగరంలో కొత్త డేరాలు వెలిసినై. కొత్తగొంతుల్తో కొత్తపాటలు వినబడుతున్నై—

* * * *

కాని పాత గొంతుల్లో జీవం తగ్గిపోయింది. ఎప్పుడూ నిశ్శబ్ద మెరగని రాత్రుళ్లుగూడా అనాథ నగరానికి నిశ్శబ్దాన్నిస్తున్నై.

"బిచ్చం దొరకటంలేదు బాబూ, ఎవరు పెడతారు యీ కరువురోజుల్లో? అందులో యీ సిటీల్లో పుణ్యం, పాపం జాలీ ఎక్కడున్నై?"

అన్నాడు తన సహజధోరణిలో మారుతి. మారుతి పల్లెటూరినుంచి వచ్చాడు. చాలా భక్తిపరుడు.

ఇప్పుడు ప్రతిరోజూ గులాబ్‌సింగ్ లాఠీకి పని తగులుతున్నది. ప్రతిరోజూ అరవ గుమాస్తాలతో

బియ్యపు దొంగధరలు నిర్ణయించటానికి జరిపే వాదనలు వదిలి, శంకర్‌లాల్ భోగాలాల్ స్వయంగా, రంగుగుడ్డల శిబిరాలను పడదొయ్యటానికి రావలసి వస్తూనే వుంది. కుమ్మోన్యా, మెట్రో బాధాప్రలాపాలు అన్ని భాషల్లోనూ వినబడుతునే వున్నై—ప్రతి దినమూ.

*　　*　　*　　*

ముసలి యల్లమంద ఎప్పుడూ బిచ్చానికి ఒంటరిగా వెళ్ళటం నేను చూడలేదు. అతనివెంట ఎప్పుడూ నీడవలె ఆర్కాటు జిల్లా కరువునుండి తప్పించుకువచ్చిన మురుగేశన్ వుంటాడు. మురుగేశన్‌కు ఒక కాలు కొద్దిగా అవుడు. అతనెప్పుడూ యల్లమందకు ముందు నడవడు. వెనక వెనకనే, ఏవో కబుర్లు వచ్చీరాని హిందూస్థానీలో చెబుతూ, నడుస్తుంటాడు.

ముసలి యల్లమంద చేతిలో పొడుగైన కర్రొకటున్నది; దాని చివర చిన్న గజ్జలగుత్తి నొకటి కట్టాడు యల్లమంద. కర్రను భూమిమీద కొట్టినప్పుడల్లా అనొక వింతతాళం మోగుతుంది. దానికి అనుగుణంగా యల్లమంద గొర్రెమందల్ని కాచే గొల్లల మేల్కొలుపుపదాలు పాడతాడు. మురుగేశన్ మధ్య మధ్య తన గొంతుకూడా కలిపి 'అనుపల్లవి' వేస్తాడు. జోలెపట్టటం, మొయ్యటం గూడా మురుగేశు చేసే పనులే.

"తాతా!" అంటాడు దక్షిణాది మురుగేశు.

"ఏం మనవడా!" అని పీఠభూమిలో గొర్రెల్ని మేపిన యల్లమంద పిలుపుకు జవాబిస్తాడు.

*　　*　　*　　*

కాని కొత్త సమ్మర్దంవచ్చి పైబడ్డ తర్వాత కాళ్ళీడ్చుకుంటూ, ఆశలేని శూన్యమైన దృక్కుల్తో, ఆకలితో, దిగాలుపడి, మేనెల వడదెబ్బలు తిని—అన్నింటినీ మించి—ఖాళీజోలెతో తాతా మనవళ్ళిద్దరూ దుఃఖనగరం చేరుతున్నారు. మళ్ళీ తెల్లవారుతుంది. మళ్ళీ ఆకలి. నిరాశ. శూన్యం. కాళ్ళయీడ్పు. ఖాళీజోలె. నిశ్శబ్దంగా ఒకరితో ఒకరు మాట్లాడుకోనకుండా, దారిపొడుగునా పెదిమలు ఒక్కసారిగూడా విప్పకుండా, ముందాశ లేకుండా, ఒకచోటు విడిచి మరొకచోటుకు జరిగి, తిరిగి ఆ దుఃఖ వలయాన్నే పూర్తిచేయటానికి తిరిగివచ్చే—యీ యిద్దరు బిచ్చగాళ్ల మనసుల్లో ఏముందో ఎవరు చెప్పగలరు?

"ఎద్దులల్లే వున్నారు. పనిచేసుకోరాదా?"

ఎక్కడపని? ఏమిపని? ఎవరిపని?

"పరదేశీ ముండాకొడుకులు. మహారాష్ట్రం దోపిడిచేస్తున్నారు"

పరదేశీలమా? ఆకలివేసి పక్కజిల్లాలని వచ్చాం. రాగూడదా? ఎవరూ ఆమాట చెప్పలేదే?

"ఛీ...మద్రాసీ..."

ఇద్దర్లో ఎవ్వరూ మద్రాసు చూడలేదు.

"ఆపండిరా! మీ బుర్రలేని పాటలు'" బుర్రలేని పాటలు! హుఁ!! ఈ పాటలతో గాదా వేలకువేలు గొర్రెలు నెమరువేసి, గడ్డిపరకలు జీర్ణించుకొన్నది? ఈ గొంతుకాదా—తప్పిపోయి తిరుగుతూన్న గొర్రెపిల్లలకు పిలుపునూ, ఆశనూ, అభయాన్నీ అందించింది? తెలంగాణా పుల్లరి అడవులన్నీ గుర్తించగల ఈ పాటలా బుర్రలేని పాటలు? గుట్టల్లో, గుళ్ళల్లో పెళ్ళి సంబరాల్లో, కొలుపుల్లో, సంతల్లో వేలాదిని తలవూపించిన ఈ పాటల్లో లోపమేముంది?

ఏమైనా, గింజగూడా నిండని పిచ్చిజోలె, అరిగిపోయి శక్తిలేని కూలబడే కాళ్లు, అంటుపడ్డ డొక్కలూ, ముందున్న వస్తువును గూడా చూడలేని కళ్ళూ—యివీ కఠిన సత్యాలు.

మురుగేశన్ వుపాయాలు గూడా ఏవీ లాభించలేదు. స్టేషనుముందు కూర్చొని యల్లమందను గుడ్డివాణ్ణిగా మార్చినా కానీ రాలలేదు. తను కాళ్లకూ చేతులకూ మురికి నూనెగుడ్డలు కట్టుకున్నా రాగి గమ్మిడీ దర్శనం కాలేదు. ఇద్దరూ కుంటివాళ్లుగా తిరిగి జన్మఎత్తినా జోలె అడుగు పూడేస్థితి కన్పించలేదు. అడుగులేని యీ చిన్నజోలె!!!

పైపెచ్చు స్టేషను దగ్గరి బీటు పోలీసుకు—యీ వేషాలన్నీ అనుమానం కలిగించినై. ఇక మళ్ళీ ఆ చెంతనా, చాయలాపోయే ఆ స్కారం, హక్కుపోగొట్టుకొన్నారు. బస్సుస్టాండ్ వద్దగూడా యిదే తంతు. యీ పోలీసులకు ఎర్రబుట్టల్లేవు. వీళ్ల లాఠీలు చిన్నవి., అంతే భేదం!!

గులాబ్ సింగువచ్చి జోలె చూశాడు. కళ్లెఱ్ఱజేసి యిద్దరి వంకా చూశాడు. అప్పటికే శిబిరాల నగరంలో దెబ్బలు తిన్న అనాథలంతా, వింతతో ఆకలిని మరిచేందుకనేమో యిక్కడచుట్టూ మూగారు. అందులో యింకా కొందరు ఏడుస్తూనే వున్నారు. మరికొందరు భయంతో వణికిపోతూనే వున్నారు. పిల్లలు, చిక్కి బొమికెల గూళ్ళై, కాకి రొమ్ములతో భయవిహ్వలులై గులాబ్ సింగు వంకచూస్తున్నారు. మరొక క్షణంలో దుఃఖనగర వాసులంతా అక్కడే వున్నారు.

యల్లమంద పెదిమలు కదిలి ఏదో జవాబుకోసం వెతుక్కుంటున్నాయ్. మురుగేశన్ కళ్ళు నేల మీదికి వాల్చాడు.

గులాబ్ సింగ్‌కు అవమానం జరిగింది. ఎంత అవమానం—యీ మౌనం ? దయలేని లాఠీముందు, రక్షణలేని అనాథల నెందరినో మోది వాళ్ళ బొమికెలకు పదును బెట్టిన తన లాఠీముందు గూడా యీ బిచ్చపు ముండాకొడుకులికెంత దర్జా? పలకరా ?

లాఠీమని యల్లమందకు ఒకటి వడ్డించాడు. యల్లమంద కదలకనే కళ్ళెత్తి చూశాడు. గుంపులోని బిచ్చగాళ్ళలో కొందరూ పెద్దకేకల్తో అక్కడే కూలబడ్డారు. కొద్దిమంది తప్పుకుపోయారు.

యల్లమంద బాధ కనుపడనీయలేదు. జాలిగా చూస్తున్న మురుగేశన్ వంకకు దృష్టి మరల్చాడు. మురుగేశుకు ధైర్యం చెప్పే దృష్టి అది. ఒక ఆత్మను వేరొకటి కదిల్చి అగ్ని రగుల్కొల్పే దృష్టి అది. ఒక పీడితహృదయంనుండి మరొక తాడిత హృదయానికి అర్థంలేని, వ్యక్తంగాని, మానవ సందేశాన్ని కొనిపోయే దృష్టి అది.

మురుగేశు ముఖంలోని భయం యిప్పుడు భయంకరంగా వంకర్లు తిరిగింది. నెత్తురు లేక ఆకలితోనే ఎఱ్ఱనైన నేత్రాల్లో నిప్పులు వేగిన విప్పుడు. ఒక్క త్రుటిలో అతని శరీరమంతా రౌద్రంతో బ్రహ్మాండమంతా తనుగా వుప్పొంగింది. మరు త్రుటిలో, గుండెలు విరుచుకు నిలబడివున్న గులాబ్ సింగు లాఠీని పైబడి మురుగేశు లాగుకున్నాడు.

యల్లమంద లంఘించి, సింగు జుట్టు లంకించుకొని కిందకు వంచాడు. మరి ఆలస్యం లేదు. మురుగేశు లాఠీ ఆ వంగిన నడుంమీద తాండవనృత్యం చేయసాగింది.

గుంపులో కొందరు బిచ్చగాళ్ళు అరిచారు. మరికొందరు "తన్నండి తన్నండి" అని కేకలు వేశారు. చాలామంది "పాపిష్టి ముండావాడు" అని దీవించారు. కొంచెం పుష్టివున్న వాళ్లు పొయ్యిరాళ్లు ఏరి పెద్దవాటిని పృథ్వీమీద కూలిన పీడకుడు గులాబ్ సింగ్ మీద బలంగా కుమ్మారు. మూలిగి, సింగు దొర్లిగింతలు పెట్టి కదలక మెదలక దుమ్ములో దుమ్ముగా పడ్డాడు. చుట్టూ రక్తం చిన్న పెద్ద మడుగులుగా నిలిచింది.

మురుగేశ్ అందరివంకా చూసి—

"చూస్తారేంరా, పిచ్చముండా కొడుకుల్లారా" అని అరిచాడు.

బిచ్చగాళ్లందరూ భయపడ్డారు—తమనెక్కడ చంపుతాడోనని. కాని ఒక ముసలి బిచ్చగాడు రక్తంలోపడిన తన పేలికల తలపాగా కొరకు వంగగానే, మురుగేశు ఒక్కతన్ను తన్నాడు.

"ఇటు—తే" అన్నాడు కళ్ళెఱ్ఱతో. వాడు భయంతో వణికి రక్తంలో తడిసిన ఎఱ్ఱగుడ్డ నిచ్చాడు.

మురుగేశు దాన్ని గులాబుసింగు లాఠీకర్రకు కట్టాడు. దాన్ని అక్కడే నిలబెట్టాడు.

"పదండి పదండి. మన బియ్యమంతా సేఠ్ కొట్లోవున్నై."

బిచ్చగాళ్ళంతా సేఠ్ కొట్టున్న పాతమేడవైపు నడిచారు. మురుగేశు ముందు కెళ్ళి చూశాడు. భోగాలాల్ అప్పటికే పలాయనం చిత్తగించాడు.

కొంచెం వదులుగా వున్న బియ్యం బస్తాను పిచ్చి శక్తితో ముందుకులాగి మురుగేశు అందరికీ చూపి—

"తీసుకోండిరా" అని గద్దించాడు.

*　　*　　*　　*

నేను క్లబ్బునుంచి తిరిగి వచ్చేటప్పటికి బిచ్చగాళ్ళ జెండా చుట్టూ పోలీసులూ మేజస్ట్రీటులూ కనిపించారు.

———